నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, ఆదివారం 19 జనవరి 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

సిండికేట్‌గా మారి ఏంచుకున్న పార్టీల నాయకులు

ఇసుక క్వారీలు హస్తగతం

- ములుగు జిల్లాలో పెసా నిబంధనలకు తూట్లు
- ఇష్టారాజ్యంగా యంత్రాలతో తవ్వకాలు
- ఉపాధి కోల్పోతున్న స్థానిక గిరిజనులు
- మౌనం వహిస్తున్న ఉన్నతాధికారులు

వరంగల్, జనవరి 18 (నమస్తేతెలంగాణ ప్రతినిధి) : ప్రభుత్వ ఇసుక క్వారీలు అధికార పార్టీ నేతల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. గిరిజన సహకార సంఘాలకు చెందాల్సిన ఇసుక రీచ్‌లను అధికారుల అండదండలతో అధికార పార్టీ నేతలు, అనధికార కాంట్రాక్టర్లు సొంతం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రీచ్‌లను దక్కించుకుంటున్న వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ప్రభుత్వ ఇసుక రవాణాలో ఇష్టారాజ్యంగా దోపిడీ చేస్తున్నారు. మనుషులకు బదులుగా భారీ యంత్రాలతో తవ్వకాలు జరుపుతూ స్థానికులకు ఉపాధి లేకుండా ఇక్కడి ఇసుకను తరలిస్తున్నారు. గోదావరి నది పరీవాహక ప్రాంతమైన ములుగు జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో 50 ఇసుక రీచుల్లో 30 రీచ్‌లను ఇటీవలే కాంట్రాక్టర్లకు కేటాయించారు. వెంకటాపురం (నూగూరు) మండలంలో 27, మంగపేట మండలంలోని ఏడు ఇసుక రీచ్‌లను సిండికేట్‌కు చెందిన బినామీ కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. గోదావరి నదికి అటూ ఇటూ ఉండే రాష్ట్ర ప్రభుత్వంలో కీలక ప్రజాప్రతినిధులు.. ముఖ్యనేత సన్నిహితుడు, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ నాయకుడి అనుచరులు కలిసి ఈ రీచ్‌లను నడుపుతున్నారు. 'పంచాయత్స్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్' (పెసా) నిబంధనల ప్రకారం ఈ ప్రాంతంలోని ఇసుక రీచ్‌లను గిరిజన సహకార సంఘాలకే కేటాయించాలి. ఇసుక రీచ్‌ల గుర్తింపు, కేటాయింపు అంతా పెసా నిబంధనలకు అనుగుణంగా జరగాలి. అధికార పార్టీ నేతలు, అధికారులు కలిసి ములుగు జిల్లాలోని ఇసుక రీచ్‌ల కేటాయింపుల్లో పెసాను పక్కనబెట్టారు. రాష్ట్ర ప్రభుత్వంలో ఓ సలహాదారు బంధువు ములుగు జిల్లాలో మైనింగ్ విభాగంలో పనిచేస్తున్నారు. సిండికేట్ వ్యవహారాలన్నీ ఆయనే చూసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఇక్కడ కేటాయించిన ఇసుక రీచ్‌ల నుంచి అధికార పార్టీ నేతలు భారీగా సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

దోపిడీలో భాగస్వామ్యం..

ఇసుకతో రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం పెంచాల్సిన అధికారులు అనధికారికంగా అధిక లోడింగ్, అక్రమ రవాణా చేసుకుంటున్న కాంట్రాక్టర్లతో కలిసిపోయి దోపిడీలో భాగమవుతున్నారు. కాంట్రాక్టర్ల మేలు కోసం కొందరు అధికారులు జిల్లా ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఏటా గోదావరి నది ప్రవాహం తగ్గుముఖం పట్టిన తర్వాత నదిలో ఎంత పరిమాణంలో ఇసుక ఉన్నది? ఎన్ని మీటర్ల లోతు వరకు ఇసుకను తీయవచ్చు? తవ్వకాలతో భూగర్భజలాలపై పడే ప్రభావం ఎంత? అనే అంశాలపై అధికారులు అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ఇసుక రీచ్‌లకు ఒకదానికి మరొక దానికి మధ్య కనీసం అర కిలోమీటర్ దూరం ఉండేలా క్వారీలను ఎంపిక చేసి జిల్లా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాలి. నీళ్లు నిల్వ ఉన్న ప్రాంతంలో క్వారీకి అనుమతులు ఇవ్వొద్దు. అయితే ములుగు జిల్లాలో ఈ నిబంధనలను పక్కనబెట్టారు. గోదావరి నది వెంట 200 మీటర్ల దూరం వరకు పక్క పక్కనే రీచ్‌లను ఎంపిక చేసి తవ్వకాలకు అనుమతులిస్తున్నారు. నీళ్లున్న ప్రాంతంలోనూ తవ్వకాలు జరిపేలా ప్రతిపాదనలు పెట్టారు. ఇసుక రీచ్‌ల కోసం ఏడాదిగా 50కి పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని కాదని అధికార పార్టీలోని కీలక ప్రజాప్రతినిధులు చెప్పిన వారికి అనుమతులిచ్చారు. ఇందుకు సంబంధించిన ప్రాథమిక గుర్తింపు ప్రక్రియ వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు సమర్పించలేదనే ఆరోపణలున్నాయి.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

కాంగ్రెస్ కార్యకర్తల్లో మొదలైన భయం

- 'స్థానిక' ఎన్నికలు సమీపించడంతో వణుకు
- కడియం శ్రీహరిది మేకపోతు గాంభీర్యం
- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

స్టేషన్ ఘన్‌పూర్, జనవరి 18: స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండడంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో భయం మొదలైందని స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. మరోవైపు అధికార దాహంతో కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. శనివారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజయ్య మాట్లాడారు. ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల్లో ఏ ఒక్కటీ నెరవేరలేదన్నారు. మహిళలకు నెలకు రూ.2500, రైతుభరోసాలో ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేశారని రాజయ్య విమర్శించారు. దీంతో అన్నివర్గాల ప్రజ లు కాంగ్రెస్ పాలనపై ఆగ్రహంతో ఉన్నారని, త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట ర్లు నిలదీయడంతో పాటు ఆ పార్టీకి గుణపా ఠం చెబుతారని ఆయన స్పష్టం చేశారు. స్థాని క సంస్థల ఎన్నికల్లో మెజార్టీ సీట్లు గెలిపిస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి చెబుతూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నాడని రాజయ్య ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనలో గత సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టోలో పెట్టని అనేక పథకాలను అమలు చేశారని వివరించారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడుతామని రాజయ్య స్పష్టం చేశారు. నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆసుపత్రిని, సాగునీటి సమస్య పరిష్కారానికి రూ.104 కోట్లు గతంలోనే కేసీఆర్ మంజూరు చేయగా దానిని తాను మంజూరు చేయించినట్లు కడియం శ్రీహరి చెప్పుకోవడం సరైంది కాదన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్, కూడా మాజీ డైరెక్టర్ ఆకుల కుమార్, మాజీ సర్పంచ్ తాటికొండ సురేశ్‌కుమార్, నాయకులు చందర్‌రెడ్డి, కనకం గణేశ్, రంగు హరీశ్, రఘురాములు, హీరా సింగ్, కే రాజిరెడ్డి, గుండె రంజిత్, చిట్టిబాబు పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

గడువులోగా పూర్తి చేయాలి

స్మార్ట్ పనులపై జీడబ్ల్యూఎంసీ కమిషనర్ సమీక్ష

వరంగల్,జనవరి 18 : గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ పరిధిలో స్మార్ట్ సిటీలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. 'స్మార్ట్ సవాల్' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో శనివారం కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో ఇంజినీరింగ్ అధికారులతో కమిషనర్ పనుల పురోగతిపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. రూ. 944.87 కోట్లతో చేపట్టిన 108 అభివృద్ధి పనుల్లో ఇప్పటి వరకు 57 పూర్తయ్యాయని, మిగతా 51 పనులు వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు వివరించారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ ఎట్టి పరిస్థితుల్లో మార్చి 31లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, స్మార్ట్‌సిటీ పీఎంసీ భాస్కర్‌రెడ్డి, ఈఈలు మహేందర్, శ్రీనివాస్, సంతోష్‌బాబు, డీఈ రవికిరణ్, ఏఈలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోలీసు క్రీడలు

కబడ్డీలో తలపడుతున్న పోలీసు జట్లు

సుబేదారి, జనవరి18 : హనుమకొండలోని జేఎన్ఎస్ మైదానంలో పోలీసు క్రీడలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన శనివారం పరుగు పందెం, కబడ్డీ, హైజంప్ పోటీలు నిర్వహించారు. అలాగే కాజీపేట సెయింట్ గాబ్రియల్ స్కూల్‌లో ఆర్మ్డ్ పోలీసు విభాగం, సెంట్రల్ జోన్ పోలీసుల మధ్య ఫుట్‌బాల్ మ్యాచ్‌ను సీపీ అంబర్ కిశోర్‌ఝా ప్రారంభించారు. ఆయా పోటీల్లో పురుష, మహిళా పోలీసులు ప్రతిభ కనబర్చారు.

కొత్త కార్డులు కొందరికే..!

దంతాలపల్లి: సర్వేకు వచ్చిన అధికారులను నిలదీస్తున్న పెద్దముప్పారం గ్రామస్తులు

కొత్తరేషన్ కార్డుల ప్రక్రియలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరు ప్రజలను అయోమయంలో పడేంది. అర్హుల కన్నా అనర్హుల పేర్లే ఎక్కువగా ఉండడం వారిలో ఆందోళన కలిగిస్తున్నది. గ్రామాలు, పట్టణాల్లో వందల సంఖ్యలో ప్రజలు రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే, కులగణన సర్వే ఆధారంగా పదుల సంఖ్యలోనే లబ్ధిదారులను గుర్తించి, వారి ఇండ్లనే అధికారులు సర్వే చేయడంతో మిగతా వారు నిరాశ చెందుతున్నారు. సర్వే కోసం గ్రామాలకు వచ్చిన అధికారులను నిలదీస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ధనవంతుల పేర్లు అర్హుల జాబితాలో ఉండడం విస్మయాన్ని కలిగిస్తున్నది.

- మహబూబాబాద్ (నమస్తే తెలంగాణ)/ హనుమకొండ/జనగామ చౌరస్తా, జనవరి 18

రేషన్ కార్డుల జారీ ప్రక్రియ గందరగోళం

- ప్రజాపాలన దరఖాస్తులు పక్కకు..
- కులగణన సర్వేనే ప్రామాణికం
- జాబితా పంపిన పౌరసరఫరాల శాఖ
- దాని ఆధారంగానే గ్రామాల్లో సర్వే..
- పేర్లు లేకపోతే అంతేనా?.. ఆందోళనలో అర్హులు
- కొన్ని జిల్లాల్లో ప్రభుత్వ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ధనవంతుల పేర్లు..!

కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ గందరగోళంగా మారింది. అర్హత ఉన్నా కొందరి పేర్లు సివిల్ సప్లయ్ శాఖ పంపిన జాబితాలో లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలన ద్వారా స్వీకరించిన దరఖాస్తులను పక్కన పెట్టి, ఇటీవల చేపట్టిన కులగణన సర్వేనే ప్రామాణికంగా తీసుకోవడంతో ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా చాలాచోట్ల అర్హులకు అన్యాయం జరుగుతున్నది. కులగణన సర్వేలో రేషన్‌కార్డు ఉందా.. లేదా అనే వివరాలను అధికారులు సేకరించగా, వాటి ఆధారంగా సివిల్ సప్లయ్ శాఖ కమిషనరేట్ అధికారులు జాబితాను రూపొందించి జిల్లా సివిల్ సప్లయ్ అధికారులకు పంపించారు. ఈ జాబితా ఆధారంగానే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమిటీలు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి పరిశీలించి గ్రామసభలు పెట్టి, అర్హులను ఎంపిక చేస్తున్నది. అయితే, ఇప్పటికే తాము రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకొన్నామని, వచ్చిన జాబితాలో తమ పేర్లు రాలేదని అర్హత ఉన్న కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలు కార్డులు ఎవరికి వస్తాయో.. ఎవరికి రావో తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఎన్నికల ముందు అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తామంటూ మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చి, ఇప్పుడు నిబంధనల పేరుతో కొర్రీలు పెట్టి కోతలు విధిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు, కొర్రీలతో లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని పలువురు విమర్శిస్తున్నారు. గతంలో ఉన్న నిబంధనల ఆధారంగానే ఇప్పుడు కూడా వినియోగిస్తున్నారు. సివిల్ సప్లయ్ అధికారుల వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలో రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షల ఆదాయం, మూడున్నర ఎకరాల తరి, ఏడున్నర ఎకరాల ఖుష్కి మించని వారు అర్హులు. ప్రభుత్వం పెట్టిన నిబంధనలతో అర్హులైన వారికి రేషన్‌కార్డులు దక్కేలా లేవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు గ్రామ, వార్డు సభలు నిర్వహించి అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఆ తర్వాత తుది జాబితాను ఖరారు చేసి కలెక్టర్ల ద్వారా పౌరసరఫరాల శాఖ రేషన్ కార్డులు మంజూరు చేసే అవకాశం ఉంది. హనుమకొండ జిల్లా సివిల్ సప్లయ్ అధికారులకు 14431 మందితో కూడిన జాబితాను పంపగా, దాని ఆధారంగానే సర్వే చేస్తున్నారు. ఇదే విషయమై సివిల్ సప్లయ్ డీసీఎస్‌వోను అడుగగా సివిల్ సప్లయి కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన జాబితా ఆధారంగా ఇంటింటా సర్వే చేస్తున్నట్లు తెలిపారు.

మానుకోటలో అంతా అయోమయం..

మహబూబాబాద్ జిల్లాలో రేషన్ కార్డుల సర్వే ప్రజాపాలన దరఖాస్తుల ప్రకారం చేస్తున్నారో.., కులగణన సర్వే ప్రకారం చేస్తున్నారో తెలియక ప్రజలు అయోమయంలో ఉన్నారు. ఒక గ్రామంలో సుమారుగా 400మంది రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే, కేవలం 40మందికి పేర్లు మాత్రమే జాబితాలో వచ్చాయని ప్రజలు చెబుతున్నారు. ఇదే విషయంపై మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామంలో సర్వే చేస్తున్న అధికారులను ప్రజలు అడ్డుకున్నారు. తమ గ్రామంలో అర్హులు చాలామంది ఉన్నా కొంతమంది పేర్లు మాత్రమే జాబితాలో వచ్చాయని వాపోయారు. అధికారులు మాత్రం మొదటి విడుతలో పేర్లు రానివారు రెండో విడుతలో దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఈనెల 26న అర్హుల జాబితాను పంచాయతీ కార్యాలయంలో ప్రదర్శిస్తామని, అందులో పేరు లేకుంటే తిరిగి దరఖాస్తు చేసుకోవాలంటున్నారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోవడంతోపాటు కులగణనలో పేర్లు నమోదు చేసుకున్నా అర్హుల జాబితాలో పేర్లు లేకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అసలు ఈ ప్రభుత్వం పథకాలు ఇస్తుందా.. లేదా అని అనుమాన పడుతున్నారు. సర్వేలో భాగంగా అధికారులు గ్రామాల్లో కొంతమంది ఇళ్లకు మాత్రమే పోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. అర్హుల జాబితాలో చాలా మందికి చోటుదక్కకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. అలాగే చిన్నగూడూరు మండలం మేఘ్యాతండాలో 60 దరఖాస్తు చేసుకుంటే, కేవలం 14మందికే మంజూరైనట్లు తండా వాసులు తెలిపారు.

చిన్నగూడూరు: రేషన్ కార్డుల విషయమై తహసీల్దార్ మహబూబ్ అలీని ప్రశ్నిస్తున్న మేఘ్యాతండా వాసులు

జనగామలో అనర్హులే ఎక్కువ..

జనగామ జిల్లాలో రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ అగమ్యగోచరంగా ఉన్నది. అర్హుల కంటే అనర్హులే ఇందులో ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తున్నది. దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్న శ్రీమంతులు, ప్రభుత్వ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను దినసరి కూలీలు, నిరుపేదలతో సమానంగా గుర్తిస్తూ జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. ప్రభుత్వం కుల గణన సర్వేను ప్రామాణికంగా తీసుకోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికే మీ సేవ కేంద్రాలు, ప్రజాపాలన ద్వారా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న ఆశావహు లు ప్రభుత్వ నిర్ణయంతో పరేషాన్ అవుతున్నారు. జిల్లాలో కొత్త రేషన్ కార్డుల సర్వే కోసం ఇటీవల 9,997 మందితో అధికారులు జాబితాను విడుదల చేశారు. ఇందులో అర్హులకన్నా, అనర్హులే ఎక్కువ సంఖ్యలో ఉన్నట్లు విశ్వసనీయ వర్గా ల సమాచారం. రఘునాథపల్లి మండలం నిడిగొండ గ్రామం లో లబ్ధిదారుల జాబితాలో అర్హులకన్నా, అనర్హులే ఎక్కువ సంఖ్యలో ఉన్నట్లు తేలింది. మొత్తం 95 మందిని గుర్తించగా, ఇందులో ప్రభుత్వ ఉద్యోగులు ముగ్గురు, ప్రభుత్వ పింఛన్‌దారులు ఎనిమిది మంది , సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఐదుగురు, మాజీ సర్పంచ్‌లు ఇద్దరు, ధనవంతులు 10మంది, దినసరి కూలీలు 20మంది, ఏడాది క్రితం పెళ్లయిన వారు ముగ్గురితోపాటు ఇతరులు 54 మంది ఉన్నారు. జనగామ పట్టణంలోని 3వ వార్డు బాలాజీ నగర్, జ్యోతి నగర్, జీఎంఆర్ గార్డె న్ పరిధిలో అధికారులు 33 మందితో జాబితా విడుదల చేశా రు. ఇందులో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు, ఒక విశ్రాంత ఉద్యోగి, మరో ఇద్దరు మరణించిన వ్యక్తులను అర్హులుగా గుర్తి స్తూ సర్వే జాబితా రూపొందించారు. మిగతా వార్డుల్లో కూడా ఇదే పరిస్థితి ఉందని స్థానికులు వాపోతున్నారు.

కాశీబుగ్గ : కొత్తపేటలో వ్యవసాయ భూములను సర్వే చేస్తున్న అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి

మరో తొమ్మిది గ్రామాలు..

- నర్సంపేట మున్సిపాలిటీలో విలీనం
- గెజిట్ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- విస్తరణతో బలోపేతం కానున్న పురపాలిక

నర్సంపేట, జనవరి18 : నర్సంపేట మున్సిపాలిటీని విస్తరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా తొమ్మిది గ్రామాలను విలీనం చేస్తూ ప్రభుత్వం శనివారం గెజిట్ విడుదల చేసింది. దీంతో మున్సిపాలిటీ మరింత బలోపేతం కానుంది. ప్రస్తుతం 44వేల మంది జనాభా ఉండగా, విలీన గ్రామాల జనాభా దాదాపు 15వేలు కలుపుకొని 60వేలు దాటనున్నది. ఈ క్రమంలో ఇప్పటికే గ్రేడ్-3లో ఉన్న మున్సిపాలిటీ గ్రేడ్-2కి అప్‌గ్రేడ్ అయ్యే అవకాశాలున్నాయి. అదే జరిగితే కేంద్ర ప్రభుత్వం నుంచి అదనపు నిధులు వచ్చే అవకాశం ఉంటుంది. విలీన గ్రామాల్లో ఇప్పటి వరకు సెర్ప్ కింద పని చేసిన మహిళా సంఘాలు ఇక నుంచి మెప్మా కిందకు రానున్నాయి. ఉపాధి పథకం మినహా అన్ని పథకాలు విలీన తొమ్మిది గ్రామాల్లో అమలు కానున్నాయి. నర్సంపేట మండలంలో 27 గ్రామ పంచాయతీలుండగా వీటిలో తొమ్మిది గ్రామ పంచాయతీలను కలిపి మున్సిపల్ పరిధిని విస్తరించనున్నారు. నర్సంపేట మండలానికి చెందిన మాధన్నపేట, నాగుర్లపల్లి, పర్శనాయక్‌తండా, ముత్తోజిపేట, రాజుపేట, మహేశ్వరం, రాములునాయక్‌తండా, ముగ్ధంపురం, రాజపల్లి గ్రామాలు నర్సంపేట మున్సిపాలిటీలో విలీనం అయ్యాయి. మొత్తంగా నర్సంపేట మేజర్ గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా విస్తరణకు అడుగులు పడ్డాయి.

మున్సిపాలిటీలుగా కేసముద్రం, స్టేషన్‌ఘన్‌పూర్

జీవో జారీ చేసిన రాష్ట్ర సర్కారు

కేసముద్రం వ్యూ

స్టేషన్ ఘన్‌పూర్

కేసముద్రం/స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 18 : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం, జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. కేసముద్రం మున్సిపాలిటీని కేసముద్రం టౌన్, విలేజ్, అమీనాపురం, ధన్నసరి, సబ్‌స్టేషన్‌తండా గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ 16 వార్డులతో, స్టేషన్‌ఘన్‌పూర్‌ను స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి, చాగల్ జీపీలను కలుపుతూ ఏర్పాటు చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేసే కార్యాచరణ ప్రారంభమైంది. కేసముద్రం కోసం 2023 ఫిబ్రవరి, జూలై నెలల్లో నాటి ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో నాలుగు విలీన పంచాయతీలతో పాటు స్టేషన్ ఘన్‌పూర్ కోసం కూడా ప్రతిపాదనలు పంపించారు. ఈ నేపథ్యంలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది. గత డిసెంబర్ 7న కేసముద్రంను మున్సిపాలిటీగా ఏర్పాటు చేసేందుకు మళ్లీ గ్రామాల ఆమోదాన్ని పంపించాలని మండల పరిషత్ కార్యాలయానికి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. దీంతో అదే నెల 9న గ్రామ సభలు నిర్వహించి గ్రామస్తుల ఆమోదంతో నివేదికను అధికారులు పంపించారు. ఈ మేరకు 20న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అసెంబ్లీలో కేసముద్రం, స్టేషన్‌ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేయడంపై ప్రకటన చేశారు. అనంతరం జనవరి 3న బిల్లును గవర్నర్‌కు పంపించగా, ఆయన ఆమోదంతో శుక్రవారం రాత్రి గెజిట్ విడుదలైంది. దీంతో ప్రభుత్వం ఇందుకు సంబంధించిన జీవోలను శనివారం విడుదల చేసింది.

కక్షతోనే ఆలయం స్వాధీనానికి కుట్ర

ఎండోమెంట్ అధికారులతో మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

- నిర్మాణం పూర్తయ్యాక నేనే అప్పగిస్తా
- ఎండోమెంట్ అధికారులతో మాజీ ఎమ్మెల్యే గండ్ర
- ట్రస్ట్ సభ్యులు, భక్తులు అడ్డుకోవడంతో వెనుదిరిగిన సిబ్బంది

కృష్ణకాలనీ, జనవరి 18 : రాజకీయ కక్షతోనే ఆలయ స్వాధీనానికి కుట్ర పన్నుతున్నారని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆరోపించారు. రాజకీయ నాయకులకు ఎండోమెంట్ అధికారులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూరునగర్‌లో నిర్మించిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని శనివారం దేవాదాయశాఖ అధికారులు స్వాధీనం చేసుకోవడానికి రాగా ట్రస్ట్ సభ్యులు, భక్తులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి గండ్ర అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ సునీత మాట్లాడుతూ దేవాదాయ శాఖ చట్టం ప్రకారం రిజిస్టర్ అయినా, కాకున్నా పోరంబోకు భూమిలో నిర్మించిన ఆలయం తమ శాఖ పరిధిలోకి వస్తుందన్నారు. ఆలయానికి భక్తులతో పాటు ఆదాయం కూడా వస్తుండడంతో ఉన్నతాధికారుల ఆదేశం మేరకు స్వాధీనం చేసుకోవడానికి వచ్చామన్నారు. ఈ క్రమంలో వారి చర్యలను అడ్డుకోవడంతో చేసేదేమీ లేక అధికారులు వెళ్లిపోయారు. ఈ విషయమై గండ్ర మాట్లాడుతూ పది రోజుల క్రితం తమకు ఎండోమెంట్ అధికారులు ఆలయాన్ని స్వాధీనం చేసుకుంటారని తెలియడంతో కమిటీ సభ్యులందరం కలిసి పనులు ఇంకా ఉన్నాయని, పూర్తయిన వెంటనే తామే అప్పగిస్తామని రాతపూర్వకంగా వినతి పత్రం అందజేశామన్నారు. ఏదైనా ఆస్తిని ప్రభుత్వం స్వాధీనం చేసుకునేటపుడు నోటీసు ఇస్తుందన్నారు. కానీ ప్రభుత్వం ఒక రాజకీయ నాయకుడి డైరెక్షన్‌లో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. ఆలయాన్ని స్వాధీనం చేసుకోవాలంటూ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని దాదాపు 15 మంది ఉద్యోగులకు ఆదేశాలిచ్చారని, ఇదంతా కక్ష సాధింపుతోనే జరుగుతున్నదన్నారు. ఈ ఆలయం తన ఒక్కడి ఆస్తి కాదని, దేవుడిని పూజించే ప్రతి ఒక్కరిదని, అధికారులు సహకరించాలని కోరారు. ఆలయం కోసం వచ్చిన విరాళాలను ఇష్టానుసారంగా వాడుతున్నానని స్థానిక ఎమ్మెల్యే ఆరోపించారని, తాను ఒక్క పైసా ముట్టుకోలేదని, దీని నిర్వహణ బాధ్యతలు తీసుకున్న వ్యక్తికే మొత్తం అప్పగించానన్నారు. ప్రస్తుతం ఆ వ్యక్తి ఎమ్మెల్యే పక్కనే ఉన్నాడన్నారు. గండ్ర వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి సిద్ధు, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, కౌన్సిలర్లు కొత్త హరిబాబు, ఎడ్ల మోనిక, బద్ది సమ్మయ్య, మంగళపల్లి తిరుపతి, మేకల రజిత, బానోత్ రజిత, ముంజంపల్లి మురళీధర్, దార పూలమ్మ, కో ఆప్షన్ మెంబర్ దొంగల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.